క్లుప్తంగా

నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకం



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ అనిత

ధారూరు: నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర కీలకమని ధారూరు ఎస్‌ఐ అనిత పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని మోమిన్‌కుర్దు గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. గ్రామస్తులందరూ స్వచ్ఛందంగా డబ్బులు పోగు చేసుకుని ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే గ్రామంలోకి ఎవరు వచ్చారో తెలుస్తుందన్నారు. అవాంఛనీయ సంఘటనలు జరిగినా, దొంగతనాలు, దోపిడీల సమయంలో సీసీ కెమెరాలు నేరస్తులను గుర్తిస్తాయని తెలిపారు. ప్రజలు సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. అనంతరం మహిళల భద్రత, రోడ్డు భద్రత, ఆత్మహత్యలు, డయల్ 100 తదితర వాటిపై ప్రజలకు విపులంగా వివరించారు.

చలివేంద్రంలో రాగిజావ పంపిణీ



యాలాలలో రాగిజావ అందజేస్తున్న నాయకులు

యాలాల: మండల కేంద్రంలో గ్రామ మాజీ సర్పంచ్ పేరి నారాయణరెడ్డి జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన చలివేంద్రంలో రాగి జావ పంపిణీని సోమవారం నిర్వహించారు. కోఆప్షన్ మాజీ సభ్యుడు అక్బర్‌బాబా గ్రామస్తులకు రాగి జావ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ సీనియర్ నేత పేరి రాజేందర్‌రెడ్డి తన తండ్రి జ్ఞాపకార్థం ప్రతి వేసవిలో రాగిజావ పంపిణీ చేపట్టడం అభినందనీయమన్నారు. ప్రతి సోమవారం మండల కేంద్రంలో నిర్వహించే సంతకు తరలివచ్చే ప్రజలకు చలివేంద్రంలో జావ ద్వారా ఎంతో ఉపశమనం కలుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు అహ్మద్, మారుతి, శేఖర్, నవీన్, శేఖర్, కిష్టప్ప, రాములు తదితరులు పాల్గొన్నారు.

పన్ను బకాయిదారులకు నోటీసులు



నోటీసు ఇస్తున్న మున్సిపల్ ఉద్యోగి

కొడంగల్: మున్సిపాలిటీ పరిధిలో ఆస్తి పన్ను చెల్లించని బకాయిదారులకు మున్సిపల్ సిబ్బంది సోమవారం రెడ్ నోటీసులను అందజేశారు. కమిషనర్ బాలరాం నాయక్ ఆదేశాల మేరకు బకాయిదారులకు తాఖీదులు ఇచ్చారు. కొన్నేళ్లుగా పన్నులు చెల్లించకుండా ఉన్న ఇంటి యజమానులను గుర్తించారు. పెండింగ్‌లో ఉన్న బకాయిలను వసూలు చేయడానికి మున్సిపల్ అధికారులు, సిబ్బంది ప్రతి రోజు వార్డుల్లో తిరుగుతున్నారు. ఈ నెల చివరి నాటికి 90 శాతం వసూలు చేయాలని టార్గెట్‌గా పెట్టుకున్నట్లు కమిషనర్ చెప్పారు.

సీసీ రోడ్డు పనుల ప్రారంభం



కమాల్‌పూర్‌లో సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న నాయకులు

యాలాల: మండలంలోని కమాల్‌పూర్‌లో సీసీ రోడ్డు పనులను సోమవారం స్థానిక నాయకులు ప్రారంభించారు. రూ.5 లక్షల ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో చేపట్టే రోడ్డు పనులకు మాజీ సర్పంచ్ బస్వరాజ్, మాజీ ఉపసర్పంచ్ రాంచందర్, యువజన నాయకుడు లక్ష్మీకాంత్‌రెడ్డి తదితరులు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామాభివృద్ధికి అడిగిన వెంటనే నిధులను కేటాయించిన ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. గ్రామంలో అవసరమైన చోట సీసీ, డ్రైనేజీ నిర్మాణ పనులను సైతం చేపడతామని పేర్కొన్నారు.

ప్రజావాణిలో రెండు అర్జీలు

మోమిన్‌పేట: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో రెండు దరఖాస్తులు వచ్చాయి. వెల్‌చాల్ గ్రామానికి చెందిన రాంచంద్రయ్య తనకు కిసాన్ సమ్మాన్ యోజన నిధి డబ్బులు జమ కావడం లేదని, మోమిన్‌పేటలోని చంద్రశేఖర్ నగర్ కాలనీలో ఉన్న ప్రాథమిక పాఠశాలలో ఇంకుడు గుంతను ఏర్పాటు చేయాలని ఉపాధ్యాయురాలు నీలాంబిక ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ మనోహర్ చక్రవర్తి, సిబ్బంది మన్‌మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

పది పరీక్షలకు సిద్ధం



బొంరాస్‌పేట జెడ్పీహెచ్‌ఎస్ పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

- బొంరాస్‌పేటలో రెండు పరీక్ష కేంద్రాలు
- వేసవి ఇబ్బందులు లేకుండా చర్యలు
- కేంద్రాల పరిశీలనలో నిర్వాహకులు

బొంరాస్‌పేట: విద్యార్థుల బంగారు భవిష్యత్ పునాదైన పదో తరగతి వార్షిక పరీక్షలకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పరీక్ష కేంద్రాన్ని ఎంపిక చేశారు. అందులో రెండు పరీక్ష కేంద్రాలుగా అధికారులు విభజించి పరీక్షలు నిర్వహించనున్నారు. అందుకు అన్ని రకాల ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు. ఎంఈఓ హరిలాల్ ఆధ్వర్యంలో సంబంధిత అధికారులు పర్యవేక్షణ చేస్తున్నారు.

486 విద్యార్థులు

పది పరీక్షలు రాయనున్న విద్యార్థులకు పరీక్ష కేంద్రాల్లో తాగునీరు, మరుగుదొడ్లు, హెల్త్ సెంటర్లు, గదుల్లో కరెంటు, సీసీ కెమెరాలు, పోలీసు బందోబస్తు ఉంటుందన్నారు. ఈనెల 21 నుంచి ఏప్రిల్ 3 వరకు పది వార్షిక పరీక్షలు జరగనున్నాయి. 21న తెలుగు, 22న హిందీ, 24న ఆంగ్లం, 26న గణితం, 28న భౌతికశాస్త్రం, 29న జీవశాస్త్రం, ఏప్రిల్2న సాంఘికశాస్త్రం, 3న ఒకేషనల్ సబ్జెక్టుల పరీక్షలుంటున్నాయి. ఈ పరీక్షలు ప్రతిరోజు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు జరగనున్నాయి. పరీక్ష కేంద్రం నంబరు 24056లో 260మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. పరీక్ష కేంద్రం నంబరు 24057లో 226మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. సంబంధిత సీఎస్, డీఓ అధికారులు పర్యవేక్షనున్నారు.

అన్ని ఏర్పాట్లు చేశాం



పదో తరగతి విద్యార్థులకు పరీక్ష కేంద్రాల్లో అన్ని వసతులు కల్పిస్తున్నాం. మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో నిర్వహించే పరీక్షలకు చౌదర్‌పల్లి, రేగడిమైలారం, బొట్లోనితండా ఆశ్రమ పాఠశాలతో పాటు, బురాన్‌పూర్ ఎంజీఆర్‌ఎస్(జీ), ఉమ్మడి మండలంలోని హకీంపేట, దుద్యాల పాఠశాలల విద్యార్థులు హాజరు కానున్నారు. హాల్ టికెట్లు ఇస్తున్నాం. **– హరిలాల్, ఎంఈఓ, బొంరాస్‌పేట**

ప్రభుత్వ బడుల అభివృద్ధికి కృషి

కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి



అధికారులకు సూచనలు ఇస్తున్న తిరుపతిరెడ్డి

కొడంగల్: ప్రభుత్వ బడుల్లోని విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎనుముల తిరుపతిరెడ్డి సూచించారు. సోమవారం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. అక్కడ నూతనంగా నిర్మిస్తున్న అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను పరిశీలించారు. పనులు వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విద్యకు మొదటి ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. అందులో భాగంగా కొడంగల్‌కు మెడికల్, నర్సింగ్, ఫిజియోథెరపీ, పారామెడికల్, వెటర్నరీ కళాశాలలు, స్కిల్ యూనివర్సిటీని మంజూరు చేసినట్లు తెలిపారు. గురుకులాలకు అధునాతన వసతులతో కొత్త భవనాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. కార్యక్రమంలో కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, ఎంఈఓ రాంరెడ్డి, నాయకులు నందారం ప్రశాంత్, ఆసీఫ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల ప్రవేశాల కరపత్రం ఆవిష్కరణ

కొడంగల్ రూరల్: కళాశాలల అభివృద్ధికి ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తుందని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి తిరుపతిరెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివాసంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు నిధులు కేటాయించినందుకుగాను అధ్యాపక సిబ్బంది తిరుపతిరెడ్డికి శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణ శివారులో ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల అదనపు తరగతి గదుల నిర్మాణ పనులకు ప్రభుత్వం రూ.8.7కోట్ల నిధులను కేటాయించిందన్నారు. అనంతరం ఆయన 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రవేశాల కరపత్రాన్ని కడా అధికారి వెంకట్‌రెడ్డి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ బి.శ్రీనివాస్‌రెడ్డి, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులతో కలిసి ఆవిష్కరించారు. 2008లో కళాశాల ప్రారంభమై అంచెలంచెలుగా ఎదుగుతూ న్యాక్ 'బి', ఐఎస్ఓ గుర్తింపు పొందిందని ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కళాశాల 3016 కోడ్‌తో దోస్త్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

కాంగ్రెస్‌తోనే పేదలకు మేలు

కరన్‌కోట్‌లో 190 మందికి రేషన్ బియ్యం పంపిణీ



నూతన లబ్ధిదారులకు బియ్యం పంపిణీ చేస్తున్న సిబ్బంది

తాండూరు రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వంతోనే పేదలకు మేలు జరుగుతుందని కరన్‌కోట్ ఎంపీటీసీ మాజీ సభ్యుడు రాజ్‌కుమార్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు అనిల్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం కరన్‌కోట్ గ్రామంలో నూతనంగా 190 మంది రేషన్‌కార్డు లబ్ధిదారులకు బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో ఒక్క కొత్త రేషన్‌కార్డు కూడా మంజూరు కాలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేదల సంక్షేమంపై దృష్టి పెట్టిందని చెప్పారు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి కృషితో కరన్‌కోట్‌ను అన్ని విధాలా అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాకు దుండగుల అంతరాయం



కాలిపోయిన ఫ్యూజులు

దుద్యాల్: గ్రామంలో తాగునీటికి ఇబ్బంది కలగకుండా నీరందించే బోరు మోటార్‌ను గుర్తుతెలియని వ్యక్తులు కాలుస్తున్నారని దుద్యాల్ పంచాయతీ కార్యదర్శి, ఎంపీఓ సత్యనారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ.. మిషన్ భగీరథ నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడినప్పుడు గ్రామంలో తాగునీటి సమస్య తలెత్తకుండా, శివారులో పంచాయతీకి చెందిన బోరును వినియోగిస్తున్నామన్నారు. కొంత మంది గుర్తుతెలియని వ్యక్తులు స్టార్టర్ డబ్బును పగులగొట్టి నిర్వీర్యం చేస్తున్నారన్నారు. నెల రోజుల్లో దాదాపు నాలుగు సార్లు స్టార్టర్‌ను కాల్చారని చెప్పారు. మరోసారి మారు ఇలాగే జరిగితే పోలీసులకు ఫిర్యాదు చేస్తానని హెచ్చరించారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు



ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ చేస్తున్న నాయకులు

కుల్కచర్ల: అర్హులైన నిరుపేద ప్రజలందరికీ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తుందని మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు ముదిరాజ్, పీఏసీఎస్ చైర్మన్ కనకం మొగులయ్య అన్నారు. సోమవారం మండలంలోని అనంతసాగర్ గ్రామంలో మంజూరైన లబ్ధిదారుల ఇళ్లకు భూమిపూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను తప్పనిసరిగా నెరవేరుస్తోందన్నారు. పైలెట్ ప్రాజెక్ట్‌గా తీసుకున్న గ్రామంలో అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశారన్నారు. విడతల వారీగా ఇళ్లతో పాటు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, ఎంపీడీఓ రామకృష్ణ, కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి గోపాల్‌నాయక్, తహసీల్దార్ మురళీధర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ భరత్‌కుమార్‌రెడ్డి, పార్టీ బీసీ సెల్ అధ్యక్షుడు మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

దైవ చింతనతో మానసిక ప్రశాంతత

బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు ప్రహ్లాదరావు



శివలింగ ప్రతిష్ఠాపనోత్సవంలో బీజేపీ నాయకులు

కుల్కచర్ల: ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు ప్రహ్లాదరావు, పార్టీ పరిగి అసెంబ్లీ ఇన్‌చార్జి మారుతి కిరణ్ అన్నారు. సోమవారం చౌడాపూర్ మండలం చాకల్‌పల్లి గ్రామంలో శివలింగ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మన సంస్కృతి, సాంప్రదాయాలను మనమే పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సనాతన ధర్మాన్ని కాపాడుకుంటూ, ఆచార వ్యవహారాలను భవిష్యత్తు తరాలకు అందించాలన్నారు. హిందూ ధర్మాన్ని కాపాడటంలో యువత ముందుకు రావాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో కేంద్ర టెలికాం అడ్వైజరీ మెంబర్ వెంకటయ్య, బీజేపీ చౌడాపూర్ అధ్యక్షులు శ్రీనివాస్, నాయకులు రాజశేఖర్, వెంకటయ్యముదిరాజ్, మాసయ్య, పురుషోత్తం, మల్లయ్య, బందయ్య, రామాంజనేయులు, శ్రీశైలం, మన్యనాయక్, తిరుపతయ్య, కృష్ణయ్య, వినోద్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

యాదవులు ఐక్యంగా ఉండాలి



నూతన కమిటీని సన్మానిస్తున్న నేతలు

దుద్యాల్: అఖిల భారత యాదవ సంఘం దుద్యాల్ గ్రామ కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బాల్‌రాజ్ యాదవ్, ప్రధాన కార్యదర్శిగా మొగులప్ప, ఉపాధ్యక్షులుగా బుగ్గప్ప, మల్లప్ప, కోశాధికారిగా వెంకటయ్య, కార్యదర్శులుగా తిరుమయ్య, అంజమ్మ, బాలమణి, గౌరవ అధ్యక్షులుగా మల్లయ్య, కాశప్ప ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. యాదవులు అన్ని రంగాల్లో రాణించాలని, ఐక్యంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు రాఘవేందర్‌యాదవ్, నియోజకవర్గ అధ్యక్షుడు మన్నె బస్వరాజ్, మండల అధ్యక్షుడు నర్సిములు యాదవ్, నాయకులు వెంకటేశ్, నర్సిములు, ప్రభాకర్‌యాదవ్, హన్మంతు తదతరులు పాల్గొన్నారు.

మహిళా సంఘం గ్రామ కమిటీ ఎన్నిక

దుద్యాల్: దుద్యాల్ గ్రామంలో నూతన మహిళా సంఘం గ్రామ కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. స్థానిక ఆంజనేయస్వామి దేవాలయం సమీపంలో నిర్వహించిన సమావేశంలో గ్రామంలోని మహిళ సంఘాలకు చెందిన సభ్యులు హాజరై కమిటీని ఎన్నిక నిర్వహించారు. అధ్యక్షులుగా గోవిందమ్మ, కార్యదర్శిగా అనిత, కోశాధికారిగా ఫాజియా, ఉపాధ్యక్షులుగా అంజమ్మ, సహాయ కార్యదర్శిగా జగ్గమ్మ ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సీసీ సంజీవ్ పాల్గొన్నారు.

ఆశవర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం ఇవ్వాలి

యాలాల: ఆశవర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం రూ.18వేలు చెల్లించడంతో పాటు ఇతర సమస్యలను వెంటనే పరిష్కరించాలని మండల ఆశవర్కర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం యాలాల తహసీల్దార్ అంజయ్యకు వినతిపత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. వైద్య శాఖలో విధులు నిర్వహిస్తున్న తమకు పదోన్నతులు, పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై గతంలో 15 రోజుల పాటు సమ్మె చేశామని గుర్తు చేశారు. నిరంతరం ప్రజా ఆరోగ్య సేవల్లో నిమగ్నమయ్యే తమను చిన్న చూపు చూడకుండా, సమస్యలను పరిష్కరించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో సులోచన, సరిత, పద్మమ్మ, వెంకటమ్మ, సువర్ణ, దస్తమ్మ, కవిత, అలివేలు తదితరులు ఉన్నారు.

పరీక్ష ప్యాడ్ల అందజేత

దుద్యాల్: మండల పరిధిలోని కుదురుమల్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు సోమవారం పరీక్ష ప్యాడ్లు అందజేశారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో గ్రామానికి చెందిన కాంగ్రెస్ యువ నాయకుడు సూర్యప్రకాశ్‌రెడ్డి 20 మంది విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు ఇచ్చారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయలు, దాత మాట్లాడుతూ.. 10వ తరగతిలో విద్యార్థులు మెరుగైన ఉత్తీర్ణత సాధించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్ యువ వికాసంతో స్వయం ఉపాధి

బొంరాస్‌పేట: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వం యువతకు స్వయం ఉపాధి కోసం 'రాజీవ్ యువ వికాసం' పథకాన్ని తీసుకు వచ్చిందని యువజన కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు గంగిసెట్టి విజయ్‌కుమార్ అన్నారు. సోమవారం ఆయన యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పట్లోళ్ల సతీశ్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు రెడ్డిశీలను సన్మానించిన మాట్లాడుతూ.. ఈ పథకంతో రాష్ట్రంలోని నిరుద్యోగులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ యువతకు స్వయం ఉపాధి లభిస్తుందన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు విరాళం

తాండూరు రూరల్: మండల పరిధిలోని గౌతపూర్‌లో సీసీ కెమెరాల ఏర్పాటుకు గ్రామానికి చెందిన ఎంపీటీసీ మాజీ సభ్యుడు నరేందర్‌రెడ్డి(సాయిరెడ్డి) ముందుకు వచ్చారు. సోమవారం కరన్‌కోట్ పోలీస్‌స్టేషన్‌లో సీసీ కెమెరాల ప్రారంభోత్సవం నిర్వహించారు. గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకు రావాలన్న ఎస్పీ నారాయణరెడ్డి పిలుపుతో నరేందర్‌రెడ్డి రూ.50 వేలను పోలీసులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ బాలకృష్ణారెడ్డి, సీఐ నగేష్, ఎస్ఐ విఠల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా 'మోడల్' వార్షికోత్సవం



విద్యార్థులతో ప్రిన్సిపాల్ బ్యూలా, ఉపాధ్యాయ బృందం

బంట్వారం: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో సోమవారం వార్షికోత్సవం అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నారు. ముఖ్య అతిథులుగా హాజరైన అధికారులు విద్యార్థులను ప్రశంసించారు. బాగా చదువుకోవాలంటూ ఆకాంక్షించారు. పదిలో ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. కార్యక్రమంలో పిన్సిపాల్ బ్యూలా, తహసీల్దార్ విజయ్‌కుమార్, ఎంఈఓ వెంకటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

తూతూమంత్రంగా ప్రజావేదిక

సోషల్ ఆడిట్ నివేదికలు బుట్టదాఖలు



ప్రజావేదికలో వివరాలు వెల్లడిస్తున్న వీఎస్‌ఏలు

బంట్వారం: ఎన్‌ఆర్‌ఈజీఎస్ సోషల్ ఆడిట్‌కు సంబంధించి సోమవారం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన ప్రజావేదికను అధికారులు తూతూమంత్రంగా నిర్వహించారు. 2023–2024 సంవత్సరానికి సంబంధించి బంట్వారం మండలంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.7.68 కోట్లు ఖర్చు చేశారు. వీటిపై లెక్కలు తేల్చేందుకు వీఎస్‌ఏలు వారం రోజుల పాటు గ్రామాల్లో సామాజిక తనిఖీ(సోషల్ ఆడిట్) నిర్వహించారు. ఈ క్రమంలో అధికారులు ప్రజావేదిక ఏర్పాటు చేశారు. డీఆర్‌డీఓ శ్రీనివాస్, ఎంపీడీఓ రాములు తదితరుల సమక్షంలోనే వీఎస్‌ఏలు సోషల్ ఆడిట్ నివేదికలను వెల్లడించారు. గ్రామాల్లో జరిగిన అవకతవకలను పూసగుచ్చినట్టు సభలో చదివి వినిపించారు. అయినప్పటికీ అధికారులు మాత్రం అంతా సూపర్ అంటూ క్లీన్‌చీట్ ఇవ్వడం గమనార్హం. ఏటా సోషల్ ఆడిట్ నిర్వహించి చేతులు దులుపుకోవడం తప్పా సొమ్ము రికవరీ, సిబ్బందిపై చర్యలు శూన్యమనే చెప్పవచ్చు.

మండప నిర్మాణానికి భూమిపూజ



మండప నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి, పర్ధానీ కుటుంబసభ్యులు

యాలాల: మండలంలోని జుంటుపల్లి సీతారామ స్వామి ఆలయ ఆవరణలో కల్యాణ మండప నిర్మాణానికి వ్యాపారవేత్త పర్ధానీ కృషి అభినందనీయమని ఆర్బీఎల్ కంపెనీ సీఈఓ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత బుయ్యని శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం సరస్వతీ పర్ధానీ జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు రూ.25 లక్షల వ్యయంతో నిర్మించనున్న కల్యాణ మండప పనులకు భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. రామాలయ ఆవరణలో భక్తుల సౌకర్యార్థం పలు అభివృద్ధి పనులకు దాతలు ముందుకు రావడం సంతోషకరమన్నారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ శ్యాంసుందర్‌రావు, పర్ధానీ కుటుంబ సభ్యులు ఓం ప్రకాష్, కృష్ణకుమార్, జయప్రకాష్, శ్రీకుమార్, మాజీ సర్పంచ్ వెంకట్‌రెడ్డి, విజయ్, మురళీ, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

'దుమ్మె'త్తి పోస్తున్న రోడ్డు



బాగాయిపల్లి సమీపంలో ఎగిసిపడుతున్న ధూళి

యాలాల: విపరీతమైన దుమ్ము ధూళితో నరక యాతన అనుభవిస్తున్నామని మండలవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని కమాల్‌పూర్ గేటు నుంచి రాస్నం శివారు వరకు చేపడుతున్న రోడ్డు విస్తరణ వాహనదారులకు తీవ్ర ఆటంకం సృష్టిస్తోంది. కాంట్రాక్టరు రోడ్డు నిర్మాణ పనుల్లో వాహనదారులు, ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఉదయం, సాయంత్రం వేళల్లో రోడ్డుపై నీళ్ల పట్టాల్సి ఉన్నప్పటికీ, ఎక్కడా పాటించడం లేదు. దీంతో ఆయా మార్గాల్లో భారీ వాహనాలు, బస్సుల రాకపోకల సమయంలో బాగాయిపల్లి, పగిడ్యాల గ్రామాల్లో రోడ్డుకిరువైపులా ఉన్న ప్రజలు పడరాని పాట్లు పడుతున్నారు. వాహనాల వెనుకాల ఎగిసిపడే దుమ్ముతో ఇంట్లో సామగ్రితో పాటు ఆరోగ్యం దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుపై ఉదయం, సాయంత్రం వేళల్లో నీళ్లు పట్టేలా చూడాలని ఆయా గ్రామస్తులు కోరుతున్నారు.



పగిడ్యాలలో వాహనాల వెనకాల దుమ్ము